క్లుప్తంగా

అయినవిల్లికి పోటెత్తిన భక్తులు



భక్తులతో కిక్కిరిసిన అయినవిల్లి విఘ్నేశ్వరుని ఆలయం

అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వరుని ఆలయం చవితి ముగింపు ఉత్సవాల్లో భాగంగా సోమవారం భక్తులతో పోటెత్తింది. స్వామివారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి ఆలయంలో చవితి ముగింపు ఉత్సవాలు, నిమజ్జన వేడుకల్లో భాగంగా భారీ ఎత్తున్న అన్నసమారాధన కార్యక్రమంలో ఏర్పాటు చేశారు. భక్తులకు బూరెలు, పాకం గారెలు, ఎర్ర గోధుమల ప్రసాదం, పులిహోర ప్రసాదం, కొబ్బరి చెట్నీ, ముద్ద పప్పు, వంకాయి జీడీపప్పు, గుమ్మడి పులుసు, బంగాళాదుంప కుర్మా, అన్నంతో కూడిన హోరా అనే ప్రసందైన అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. సుమారు ఐదువేల మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించినట్లు ఆలయ వర్గాలు తెలిపాయి.

22న విజయ బేతాళ ఉత్సవ సమావేశం

అంబాజీపేట: ఏటా విజయ దశమిని పురస్కరించుకుని నిర్వహించే విజయ బేతాళ ఉత్సవ ఏర్పాట్లపై చర్చించేందుకు ఈ నెల 22వ తేదీన అంబాజీపేట శెట్టిబలిజ అభ్యుదయ సంక్షేమ సంఘ భవనంలో సమావేశం నిర్వహించనున్నట్లు సంఘ అధ్యక్షుడు దొమ్మేటి రామారావు సోమవారం తెలిపారు. బేతాళ స్వామివారి దసరా కలశ స్థాపన, ఉత్సవం తేదీపై ఆ రోజు నిర్ణయం తీసుకుంటామన్నారు. కావున స్థానిక పెద్దలు, యువకులు అందరూ సమావేశంలో పాల్గొనాలని కోరారు.

బొమ్మల తయారీతో జీవనోపాధి



శిక్షణా సమావేశంలో మాట్లాడుతున్న ఆక్సిజన్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు గంగాధర్

మామిడికుదురు: విలువ ఆధారిత బొమ్మలను తయారు చేయడం ద్వారా జీవనోపాధి లభిస్తుందని పాశర్లపూడికి చెందిన ఆక్సిజన్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు కటికిరెడ్డి గంగాధర్ తెలిపారు. రాజమహేంద్రవరం ఓఎన్‌జీసీ సౌజన్యంతో ఒడిశా రాష్ట్రానికి చెందిన మాస్టర్ ట్రైనర్స్‌తో కొబ్బరి పీచు బొమ్మల తయారీపై శిక్షణా కార్యక్రమం పాశర్లపూడి గ్రామంలో సోమవారం ప్రారంభమైంది. 30 మంది మహిళలకు ఇక్కడ ఉచితంగా శిక్షణ ఇస్తారు. ఒడిశాలో కొబ్బరి పీచు బొమ్మల తయారీలో అనుభవం పొందిన ఇద్దరు మాస్టర్ ట్రైనర్లు పాశర్లపూడి గ్రామ మహిళలకు శిక్షణ ఇచ్చి వారిని ప్రోత్సహిస్తున్నారని ఆక్సిజన్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు గంగాధర్ తెలిపారు.

కళాకారుల సంఘం కార్యదర్శి శంకరరావు మృతి



వాసంశెట్టి శంకరరావు (ఫైల్)

మామిడికుదురు: కోనసీమ వృత్తి కళాకారుల సంక్షేమ సంఘం ఆర్గనైజింగ్ కార్యదర్శి మామిడికుదురుకు చెందిన వాసంశెట్టి శంకరరావు(65) ఆదివారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. ఆయన అంత్యక్రియలను సోమవారం రాజోలు మండలం సోంపల్లిలో నిర్వహించారు. శంకరరావు అప్పనపల్లి శ్రీబాల బాలాజీ దేవస్థానం ట్రస్టు బోర్డు సభ్యుడిగా, రాజోలు తాలూకా శెట్టిబలిజ సంఘం శాంతి కమిటీ సభ్యుడిగా, మదర్ థెరిస్సా టైలర్ల సంఘం గౌరవాధ్యక్షుడిగా పనిచేశారు. శంకరరావు మృతికి సంతాపంగా మండల పరిధిలోని టైలరింగ్ షాపులను మూసి వేసి బంద్ పాటించారు.

ఏఎంసీ సెక్రటరీ మృతి



వి.యశ్వంతరావు (ఫైల్)

రావులపాలెం: కొత్తపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) సెక్రటరీ వి.యశ్వంతరావు(57) సోమవారం ఆకస్మికంగా మృతి చెందారు. ఆయన మృతికి ఆర్జేడీ పి.సుధాకర్, మార్కెటింగ్ ఆఫీసర్ కె.విశాలాక్షి ఏఎంసీ సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు.

అశ్లీల నృత్యాలపై కేసు

మామిడికుదురు: వినాయక నిమజ్జనం సందర్భంగా పెదపట్నంలంకలో ఆదివారం ఏర్పాటు చేసిన ఊరేగింపులో అశ్లీల నృత్యాలు ఏర్పాటు చేసిన కమిటీ సభ్యులపై కేసు నమోదు చేశామని నగరం ఎస్‌ఐ చైతన్యకుమార్ సోమవారం తెలిపారు. డీజే సౌండ్ బాక్సులు, ట్రాక్టర్ సీజ్ చేశామన్నారు. ఊరేగింపులు, నిమజ్జనాల సందర్భంగా మండల పరిధిలోని 18 గ్రామాల్లో ఎక్కడైనా అసాంఘిక కార్యక్రమాలు, అశ్లీల నృత్యాలు ఏర్పాటు చేస్తే కమిటీ సభ్యులపై కేసులు నమోదు చేసి కఠినమైన చర్యలు తీసుకుంటామన్నారు.

మూషికాల మూక దాడి

- నివారించకపోతే పంటకు నష్టమే
- ఆందోళన చెందుతున్న అన్నదాతలు
- సామూహిక నివారణ చర్యలతోనే మంచి ఫలితాలు



ఎలుకల నివారణకు సిద్ధం చేస్తున్న బుట్టలు

ఆత్రేయపురం: ప్రస్తుతం వరిలో ఎలుకల బెడద ఎక్కువగా ఉంది. దుబ్బు దశలో ఉన్న వరి పంటపై రాత్రి, పగలు అన్న తేడా లేకుండా ఎలుకలు దాడి చేసి తీవ్ర నష్టం కలిగిస్తున్నాయి. ఎలుకలను నివారించకపోతే పంట దిగుబడిలో 10 శాతం నుంచి 30 శాతం వరకూ తగ్గిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన చెందుతున్నారు. మరోవైపు ఎలుకల నివారణకు ఎన్ని చర్యలు చేపట్టినా ఫలితం అంతంత మాత్రమేనంటున్నారు. అన్నదాతలు సామూహిక ఎలుకల నివారణ చేపడితే మంచి ఫలితం కనిపిస్తుందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. దాని కోసమే గ్రామాల్లో అన్నదాతలకు రైతు సేవా కేంద్రాల ద్వారా బ్రోమోడయోలిన్ మందు పంపిణీ చేశారు.

ఎడాపెడా కొరికేస్తున్న ఎలుకలు

ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో వరి పంటపై ఎలుకల దాడి అధికంగా కనిపిస్తోంది. రైతులు బుట్టలు పెట్టినా, బొరియల్లో పొగపెట్టినా, ఎన్ని మందులు వాడినా ఎలుకల ఉధృతి మాత్రం తగ్గడం లేదు. దీంతో రైతులకు ఎలుకల నివారణ కోసం అధికంగా ఖర్చు అవ్వడమే కాకుండా పంటను నష్టపోతున్నారు. ఎలుకలు దుబ్బులను ఎడాపెడా కొరికేస్తుండడంతో అవి పాడై పంట పనికి రాకుండా పోతోంది. మూషికాల దాడి కారణంగా పంట పొలాల్లో అక్కడక్కడా ఖాళీలు ఏర్పడుతున్నాయి. అందుకే పంటను ఎలుకల బారి నుంచి కాపాడుకునేందుకు రైతులు సామూహిక ఎలుకల నివారణ పద్ధతిని అవలంబించాలని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. రైతులు కేవలం తమ పొలానికే పరిమితమై ఎలుకల నిర్మూలన చేపట్టడం వల్ల ప్రయోజనం ఉండదంటున్నారు. ఎవరికివారే యమునా తీరే అన్న చందంగా వ్యవహరిస్తే పక్క పొలాల్లో ఉన్న ఎలుకలు వచ్చి నష్టం కలిగిస్తాయంటున్నారు. రైతులంతా సామూహికంగా ఎలుకల నిర్మూలన చర్యలు చేపడితేనే ప్రయోజనం ఉంటుందని సూచిస్తున్నారు.

బొరియల వద్ద విషపు ఎర

వ్యవసాయ శాఖ నూరు శాతం రాయితీపై ఎలుకల నిర్మూలనకు బ్రోమోడయోలిన్ మందును రైతులకు అందిస్తుంది. హెక్టారుకు 10 గ్రాముల చొప్పున బ్రోమోడయోలిన్ మందు వాడుకోవాలి. విషపు ఎర తయారీకి 2 గ్రాముల బ్రోమోడయోలిన్ మందును 100 గ్రాముల నూకలు, 2 గ్రాముల నూనె కలిపి ఒకొక్క ఎలుక బొరియ వద్ద 10 గ్రాముల చొప్పున పొట్లాలుగా కట్టి ఉంచాలి. ఈ విధంగా చేయడం ద్వారా ఎలుకలను నిర్మూలించుకోవచ్చు. కాగా ముందు రోజు పొలంలో ఉన్న బొర్రెలను గుర్తించి మట్టితో మూసివేయాలి. తరువాత రోజున తెరిచిన బొరియల వద్ద విషపు ఎరను పెట్టి మూసేయాలి. అలా పది రోజుల తరువాత తెరుచుకున్న బొరియలను గుర్తించి మళ్లీ విషపు ఎరను వాడాలి. ఈ విధంగా చేయడం ద్వారా ఎలుకల నిర్మూలన సాధ్యమవుతుందన్నారు.

సామూహిక చర్యలతోనే పరిష్కారం



పంట దుబ్బు దశలో ఉన్నప్పుడు ఎలుకల ప్రభావం ఎక్కువగా ఉంటుంది. ఎలుకల నివారణ కోసం రైతులందరికీ బ్రోమోడయోలిన్ మందు పంపిణీ చేశాం. ఎవరికి వారు మందు పెట్టకుండా రైతులంతా సామూహికంగా ఎలుకల నివారణకు పూనుకున్నప్పుడే సమస్యకు పరిష్కారం లభిస్తుంది.

– జె.భార్గవ్ మహేష్, వ్యవసాయాధికారి, ఆత్రేయపురం మండలం

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

రావులపాలెం: విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు అమలాపురం ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.రవికుమార్ సోమవారం తెలిపారు. ఈతకోట సబ్‌స్టేషన్ పరిధిలో మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ మండలంలోని గోపాలపురం, ఈతకోట, ముమ్మిడివరప్పాడు, లక్ష్మీపోలవరం, పొడగట్లపల్లి, దేవరపల్లి, మట్టలదొడ్డి, కేతరాజుపల్లి, చెల్లిరేవు, వెదిరేశ్వరం, కోసూరి నగర్, గరువు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

నేటి నుంచి స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాలు

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో మంగళవారం స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాలు ప్రారంభించనున్నట్లు ఎంపీడీఓ కె.జాన్‌లింకన్ తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు వచ్చే నెల 2వ తేదీ వరకూ స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాల్ని నిర్వహిస్తామన్నారు. గ్రామాల్లో సంపూర్ణ పారిశుధ్యమే లక్ష్యంగా ప్రజాప్రతినిధులు, అధికారులు కృషి చేస్తారన్నారు.

హోరాహోరీగా లడ్డూ వేలం పాటలు



అంబాజీపేట గంగలకుర్రు మలుపులో స్వామివారి లడ్డూను దక్కించుకున్న భక్తులు

అంబాజీపేట: వినాయక చవితి నవరాత్ర ఉత్సవాలను పురస్కరించుకుని మండలంలోని పలు వినాయక ఆలయాల వద్ద సోమవారం భారీ అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. తొమ్మిది రోజుల పాటు విశేష పూజలందుకున్న గణనాథుడిని మేళతాళాలు, భారీ బాణసంచా, యువకుల కేరింతల నడుమ ఆయా గ్రామాల్లో ఉన్న కౌశికలలో నిమజ్జనం చేశారు. ఆలయాల వద్ద స్వామి వారి లడ్డూ వేలం పాటలు హోరాహోరీగా సాగాయి. పుల్లేటికుర్రు శివారు వ్యాఘ్రేశ్వరం చెరువు గట్టు వద్ద 15 కేజీల లడ్డూను రూ.42 వేలకు కముజు వ్యాఘ్రి దక్కించుకున్నారు. అలాగే గంగలకుర్రు మలుపు వద్ద ఉన్న శ్రీవిజయ గణపతి ఆలయం వద్ద స్వామి వారి లడ్డూను మొల్లేటి సంతోష్ రూ.24 వేలకు పాడారు. గంగలకుర్రులో శ్రీపాద సత్యనారాయణమూర్తి రూ.12,500కు, గుంట మామిడితోటలో అమలాపురానికి చెందిన దంగేటి వెంకటరమణ రూ.18,800కు స్వామి వారి లడ్డూలను కైవసం చేసుకున్నారు.

యథాతథంగా రాకపోకలు

సఖినేటిపల్లి: మాధవాయిపాలెం ఫెర్రీగా ప్రభుత్వ గుర్తింపు పొందిన సఖినేటిపల్లి–నర్సాపురం రేవులో పంటు సేవలను సోమవారం నుంచి యథాతథంగా అధికారులు ప్రారంభించారు. ఈ నెల 5వ తేదీన గోదావరి నదికి వరద ఉధృతి పెరిగిన నేపథ్యంలో ముందస్తు రక్షణ చర్యల్లో భాగంగా అధికారులు అప్పట్లో రేవులో పంటు సేవలను తాత్కాలికంగా నిలుపుదల చేశారు. సుమారు పది రోజుల అనంతరం రేవు తెరుచుకోవడంపై ప్రయాణికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా ఈద్ మిలాద్ ఉన్ నబీ



అంబాజీపేటలో మసీద్‌లో ప్రార్థన చేస్తున్న ముస్లింలు



మామిడికుదురు మసీదులో జరిగిన మిలాద్‌లో పాల్గొన్న ముస్లింలు



కొత్తపేట మసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

అంబాజీపేట: ఈద్ మిలాద్ ఉన్ నబీ వేడుకను పురస్కరించుకుని స్థానిక అంజుమనే ఇందాదుల్ ముస్లీమీన్ మసీదు వద్ద కమిటీ అధ్యక్షులు ఎండీ రఫీ ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా మహ్మద్ ప్రవక్త జయంతి వేడుకలను నిర్వహించారు. అనంతరం మహ్మద్ ప్రవక్త జీవిత కథను వివరించారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి గౌస్ మోహిద్దీన్, కరీముల్లా, ఇబ్రహీం, సురాజ్, ఇస్మాయిల్, కరీం తదితరులు పాల్గొన్నారు.

ఆనందోత్సాహాలతో మిలాద్ ఉన్ నబీ

మామిడికుదురు: ఇస్లాం మత వ్యవస్థాపకులు మహ్మద్ ప్రవక్త జయంతిని పురస్కరించుకుని సోమవారం మిలాద్ ఉన్ నబీ పండగను ముస్లింలు ఆనందోత్సాహాలతో నిర్వహించుకున్నారు. దీనిలో భాగంగా మామిడికుదురు సున్నీ జామియా మసీదులో మిలాద్ జరిగింది. పలువురు కవులు తమ కవిత్వాల ద్వారా మహ్మద్ ప్రవక్త జీవిత చరిత్రను భక్తులకు వివరించారు. మహ్మద్ ప్రవక్త ఇస్లాం మతానికే ఆదర్శనీయుడని మత ప్రబోధకులు మహ్మద్ సాధిక్ అన్వర్ రజ్వీ పేర్కొన్నారు. కార్యక్రమంలో మసీదు కమిటీ అధ్యక్షులు మసూద్ మొహిద్దీన్, సర్పంచ్ గౌస్ మొహిద్దీన్, అన్వర్ తాహిర్ హుస్సేన్, షేక్ కమీముల్లా, నూర్షైన్ అబ్బాస్, మహ్మద్ కిశ్వర్, సయ్యద్ రూహి పాల్గొన్నారు.

కొత్తపేట: మహ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకుని సోమవారం మిలాద్ – ఉన్ – నబీ వేడుకలను ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. ఒకరినొకరు పరస్పరం ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు చెప్పుకున్నారు. కొత్తపేట కమ్మిరెడ్డిపాలెం మసీదులో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు, సేవా కార్యక్రమాలు నిర్వహించారు. మసీదు, షాదీఖానా కమిటీ అధ్యక్షుడు షేక్ ఖాజాబాబు, ముస్లిం నాయకులు షేక్ గౌస్, మహ్మద్ హరుణ్, షేక్ బడేమియా, షేక్ మక్బుల్ తదితరులు పాల్గొన్నారు. మండలంలోని వానపల్లి, పలివెల గ్రామాల్లోనూ ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

కన్నీరు పెట్టిస్తున్న ఉల్లి

పెరిగిన ధరలతో వినియోగదారుల గగ్గోలు



అంబాజీపేటలో విక్రయానికి సిద్ధంగా ఉన్న ఉల్లిపాయలు

అంబాజీపేట: ఉల్లిని కోయకుండానే కొనుగోలుదారుల కంట కన్నీరు పెట్టిస్తోంది. నెలరోజుల వ్యవధిలో ధరలు రెట్టింపు దాటడమే కాకుండా మరింత వేగంగా పెరుగుతుండడంతో ప్రజలు హడలిపోతున్నారు. నిత్యం ఆహార పదార్థాల్లో ఉల్లికి ఉన్న స్థానం మొదటి వరుసలో ఉంటుంది. ధరలు ఆకాశాన్నంటుతున్న నేపథ్యంలో ఇంటింటా వంటల్లో ఉల్లిపాయల వాడకాన్ని తగ్గించుకోవల్సిన పరిస్థితి తలెత్తుతుంది. నెల రోజుల క్రితం కేజీ ధర రూ.20 లోపు ఉన్న ధర ప్రస్తుతం కేజీ రూ.60 దాటడంతో కొనుగోలు కష్టతరంగా మారిందని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్‌లో డిమాండ్‌కు తగ్గట్టుగా ఉల్లిపాయలు దిగుమతి కాకపోవడంతోనే ధరలు రోజురోజుకు పెరుగుతున్నాయని ఉల్లి వ్యాపారులు చెబుతున్నారు. మే, జూన్‌లలో మహారాష్ట్రలో వర్షాల కారణంగా ఉల్లి పంట మొత్తం పాడైపోవడంతో ఉల్లి మార్కెట్‌కు రావడం తగ్గిందంటున్నారు. ఉల్లి ధరలు అమాంతం పెరగడంతో తమ హోటళ్ల నిర్వహణ కష్ట సాధ్యంగా మారిందంటూ హోటళ్ల నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఓ మోస్తరు హోటల్‌లోనే రోజుకు 20 నుంచి 30 కేజీలకు పైగా ఉల్లిపాయల వాడకం ఉంటుందని దీంతో ఉల్లిపాయలకే అదనంగా రూ.1,000కి పైగా ఖర్చు చేయాల్సి వస్తుందని చెబుతున్నారు.

చిన్నారి వైద్యానికి రూ. 50 వేల ఆర్థిక సాయం



చిన్నారి తండ్రికి సాయం అందజేస్తున్న కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు

రావులపాలెం: అనారోగ్యంతో బాధపడుతున్న మూడేళ్ల చిన్నారికి వైద్యం చేయించేందుకు రావులపాలెం కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ, కాకినాడ ఆదరణ ఫ్రెండ్స్ ఫౌండేషన్ ట్రస్ట్ సంయుక్తంగా రూ.50 వేల నగదు సోమవారం అందజేశారు. ఆత్రేయపురం మండలం లొల్ల గ్రామానికి చెందిన చల్లా దేవర్షిని రాజశ్రీ(3), ఐదు రోజుల క్రితం ఆరోగ్యం బాగోకపోవడంతో హాస్పిటల్‌కి తీసుకువెళ్లారు. పాప బ్రెయిన్ లో కణతులు ఉన్నాయని డాక్టర్లు చెప్పారు. రోజుకి రూ.25 వేలు ఖర్చవుతుంది. ఇప్పటికే రూ.లక్ష వరకూ హాస్పిటల్‌లో కట్టాల్సి ఉందని కూలి పని చేసుకునే పాప తండ్రికి అంత స్తోమత లేకపోవడంతో స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులను సాయం కోరారు. దీంతో పాప తండ్రి లొల్లయ్యకి కాశీ అన్నపూర్ణా దేవి సేవా సంస్థ నుంచి రూ.30 వేలు, కాకినాడ ఆదరణ ఫ్రెండ్స్ ఫౌండేషన్ ట్రస్ట్ నుంచి రూ.20 వేలు మొత్తంగా రూ.50 వేల ఆర్థిక సాయం అందజేసినట్టు సంస్థ సభ్యులు తెలిపారు.

ఓజోన్ పొర మానవాళికి రక్షణ కవచం



కొత్తపేటలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపాల్ పెద్దిరాజు, అధ్యాపకులు

కొత్తపేట: ఓజోన్ పొర అనేది మానవాళికి రక్షణ కవచమని, దాన్ని కాపాడుకునేందుకు అందరూ బాధ్యతాయుతంగా నడుచుకోవాలని స్థానిక విశ్వకవి వేమన ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పెద్దిరాజు అన్నారు. ప్రపంచ ఓజోన్ దినోత్సవం సందర్భంగా కళాశాలలో కెమిస్ట్రీ విభాగం ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ డాక్టర్ రాజు అధ్యక్షతన విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ పెద్దిరాజు మాట్లాడుతూ సూర్యుడి నుంచి వచ్చే ప్రమాదకరమైన అతి నీలలోహిత కిరణాలను భూమి మీద పడకుండా ఓజోన్ పొర ఆపుతుందన్నారు. వాతావరణ సమతుల్యతను కాపాడటంలో ఓజోన్ పొర కీలకపాత్ర పోషిస్తుందని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పోస్టర్ ప్రజెంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ టి.రమాదేవి, కెమిస్ట్రీ అధ్యాపకులు డాక్టర్ జి.శ్రీనివాసులు, పి.సాయికృష్ణ, డాక్టర్ డీసీహెచ్ పాపారావు, డాక్టర్ కె.అంకమరావు, సీహెచ్ నాగరాణి తదితరులు పాల్గొన్నారు.

సాగునీటికి ఎదురుచూపు

ఆలమూరు: మండలంలోని పినపళ్ల, పెదపళ్ల, సంధిపూడి గ్రామాలకు చెందిన రైతులు సాగునీటి కోసం ఎదురు చూస్తున్నారు. ఇటీవల కాలంలో భారీ వర్షాలు కురిసినా, వరద ప్రభావంతో లక్షలాది క్యూసెక్కుల నీరు పంట కాలువలకు విడుదల చేసినా రైతుల పొలాలకు నీరందడం లేదు. కొత్త కాలువ, వెదురుమూడి కాలువలతో పాటు బూరుగుపుంత, మధ్య పుంత వంటి చిన్న కాలువల్లో సాగునీరు పారక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ మూడు గ్రామాల్లో పంట కాలువల మీద సుమారు 1,500 ఎకరాల వరి సాగు జరుగుతుంది. వర్షాకాలంలో కూడా సాగు నీరందక పోవడానికి కాలువల్లో పూడికతీత తీయకపోవడమే కారణమని రైతులు ఆవేదన చెందుతున్నారు. దీనికి తోడు వ్యర్థాలు కూడా పంట కాలువల్లోకి రావడంతో సాగునీరు వేగం తగ్గిపోయి ఎక్కడికక్కడ నీరు నిలిచిపోతుందంటున్నారు. పినపళ్లలోని పుంతలో మునలమ్మ ఆలయం నుంచి మురుగు కాలువ వరకూ ఉన్న పంట కాలువ మూడడుగుల మేర కుచించుకుపోవడంతో సాగునీరు వెళ్లే మార్గం కనిపించడం లేదు. ఇకనైనా అధికారులు స్పందించి ఖరీఫ్ సాగుకు పూర్తి స్థాయిలో సాగునీటిని అందించాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు. దీనిపై ఆలమూరు ఇరిగేషన్ జేఈ డి.కృష్ణ త్రిమూర్తులును వివరణ కోరగా వ్యర్థాలు, గుర్రపు డెక్కతో మూసుకుపోయిన పంట కాలువను యంత్రాల సాయంతో ఆధునీకరించి సాగు నీరు అందిస్తామని బదులిచ్చారు.



పినపళ్లలోని పుంతలో మునలమ్మ ఆలయం సమీపంలో వ్యర్థాలతో నిండిన పంట కాలువ

బై బై గణేశా

- ఘనంగా ముగిసిన గణపతి నవరాత్రులు
- గణపతి లడ్డూలకు ఉత్సాహంగా వేలం పాటలు
- కోలాహలంగా గణపతి నిమజ్జనోత్సవాలు



చాకలిపాలెంలో చిరు గణనాథుడిని నిమజ్జనానికి తరలిస్తున్న చిన్నారులు



రావులపాలెంలో వినాయకుడిని ట్రాక్టర్‌పై ఊరేగిస్తున్న భక్తులు



టేకిశెట్టిపాలెం పుష్కరఘాట్ వద్ద క్రేన్ సాయంతో గణనాథుడి నిమజ్జనం



చొప్పెళ్ల లాకుల వద్ద గణనాథుడిని నిమజ్జనం చేస్తున్న భక్తులు



మామిడికుదురు శివారు చేరితోటలో 75 వేలకు లడ్డూను దక్కించుకున్న శ్రీనివాస్

కొత్తపేట: వినాయక చవితి పర్వదినం నుంచి ఘనంగా ప్రారంభమైన గణపతి నవరాత్రులు ఆదివారం రాత్రితో ఘనంగా ముగిశాయి. గణపతి విగ్రహాలను మేళ తాళాలు, వివిధ సాంస్కృతిక ప్రదర్శనల నడుమ గ్రామ పురవీధుల్లో ఊరేగించి సమీప ప్రధాన పంట కాలువలు, గోదావరి నదుల్లో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా పలు నవరాత్ర పందిర్లలో స్వామివారి విగ్రహం వద్ద ప్రసాదంగా ఉంచిన లడ్డూలకు వేలం పాటలు ఉత్సాహంగా జరిగాయి. స్థానిక చింతామణి గణపతి పందిరిలో లడ్డూకు వేలం నిర్వహించగా ఆర్యవైశ్య యూత్ సభ్యులు రూ 40,116 కు పాడుకుని లడ్డూను దక్కించుకున్నారు. స్థానిక కోదండరామాలయం (కొత్త రామాలయం) వద్ద లడ్డూను స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకుడు తణికెళ్ల శాస్త్రి స్వామి పేరున రూ.10,500కు పాడుకున్నారు.

మామిడికుదురు: గణపతి నవరాత్రుల్లో భాగంగా ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహాల నిమజ్జనం సోమవారం అంగరంగ వైభవంగా జరిగింది. మేళ తాళాలు, సన్నాయి వాయిద్యాలు, బాణాసంచా కాల్పులు, భక్తుల కోలాహలం నడుమ వినాయకుని విగ్రహాలను ఊరేగించారు. బి.దొడ్డవరం ఊరేగింపులో ఏర్పాటు చేసిన కోలాటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మామిడికుదురు శివారు చేరితోట రామాలయం వద్ద వినాయకుని విగ్రహం చేతిలోని 19 కిలోల లడ్డూను వేలంలో స్థానికుడు కాండ్రేగుల నిఖిల్ సత్యశ్రీనివాస్ రూ.75 వేలకు, గాలిదేవరపాలెంలో ఐదు కిలోల వినాయకుని లడ్డూను గాలిదేవర సూరిబాబు రూ.50 వేలకు చేజిక్కించుకున్నారు.

సఖినేటిపల్లి: మండల పరిధిలోని టేకిశెట్టిపాలెం పుష్కరఘాట్ వద్ద సోమవారం వినాయక విగ్రహాల నిమజ్జనోత్సవాలను భక్తులు ఘనంగా నిర్వహించారు. ఘాట్ వద్ద భద్రత దృష్ట్యా కొత్త కాజ్‌వే పైనుంచి క్రేన్ ద్వారా గోదావరి పాయలో ఈ నిమజ్జనం నిర్వహించారు. ఘాట్ వద్ద లైటింగ్, భక్తులకు టిఫిన్, ప్రసాదం, మంచినీటి వసతి ఏర్పాట్లకు స్థానిక వనదుర్గ లైటింగ్, మైక్ సర్వీస్ ప్రొప్రయిటర్ రేకపల్లి నరసింహారావు రూ.2 లక్షల సొంత నిధులు ఖర్చు చేశారు.

పి.గన్నవరం: మండలంలోని చాకలిపాలెం గ్రామంలో చిన్నారులచే సోమవారం జరిగిన చిరు గణనాథుని నిమజ్జన యాత్ర భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. చిన్న ఎడ్ల బండిపై వినాయకుని విగ్రహాన్ని పెట్టి చాకలిపాలెం నుంచి రాజోలు వరకూ ఊరేగించి వశిష్ట నదీ పాయలో నిమజ్జనం చేశారు. చాకలిపాలెంలో న్యాయవాది మొల్లేటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆర్‌పీ రోడ్డు పక్కన ఉయ్యాలలో చిరు గణనాథుడి విగ్రహాన్ని ఉంచి తొమ్మిది రోజుల పాటు పూజలు చేశారు. ఈ ఉత్సవ విగ్రహాన్ని సోమవారం చిన్నారులచే నిమజ్జనం చేయించారు.

మలికిపురం: మలికిపురం కూడలిలోని గణపతి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన గణనాథుని ఉత్సవ విగ్రహాన్ని చాంబర్ ఆఫ్ కామర్స్, రైతు, వర్తక సంఘం ఆధ్వర్యంలో ఊరేగిస్తూ దిండి పుష్కరఘాట్ వద్ద నిమజ్జనం చేశారు. మేడిచర్లపాలెం, గుడిమెళ్లంక, రామరాజులంక, కేశనపల్లి, చింతలమోరి, తూర్పుపాలెం గ్రామాలలోని వినాయకుని విగ్రహాలను బాణాసంచా కాల్పులతో, తీన్‌మార్ బ్యాండు వాయిద్యాలతో ఊరేగించారు.

రావులపాలెం: మండలంలోని వివిధ ఆలయాల వద్ద, ముఖ్య కూడళ్లలో నెలకొల్పిన వినాయకుడి విగ్రహాలను సోమవారం ఊరేగింపుగా నిమజ్జనానికి తరలించారు. ఈ సందర్భంగా ఊరేగింపులో ట్రాక్టర్లపై ఏర్పాటు చేసిన దేవుళ్ల వేషధారణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

రాజోలు: స్థానిక పుష్కర ఘాట్ వద్ద గణేష్ నిమజ్జనం మహోత్సవం రాజోలు తాలూకా గణేష్ నిమజ్జనం కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా జరిగింది. ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ నిమజ్జన కార్యక్రమానికి కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. రాజోలు, మామిడికుదురు, పి.గన్నవరం, మలికిపురం మండలాల నుంచి సుమారు 150 గణనాథుల విగ్రహాలను భక్తులు రాజోలు వశిష్టగోదావరి నదీతీరానికి ఊరేగింపుగా తోడ్కొని వచ్చి నిమజ్జనం చేశారు. ఎస్సై రాజేష్ కుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

శత రుద్రీయం.. కన్నుల వైకుంఠం

అంబాజీపేట: భగవాన్ శ్రీసత్య సాయిబాబా శత జయంతి వేడుకల్లో భాగంగా నిర్వహించిన శత రుద్రీయం కన్నుల వైకుంఠంగా చూపరులను ఆకట్టుకుంది. సత్యసాయి సేవా సంస్థల రాష్ట్ర వేదాధ్యయన విభాగం ఆధ్వర్యంలో 96వ మహా న్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం సోమవారం అత్యంత వైభవంగా జరిగింది. అంబాజీపేట వాసవీ ఫంక్షన్ హాల్‌లో జరిగిన రుద్రాభిషేకానికి శ్రీసత్యసాయి రాష్ట్ర వేదాధ్యయన విభాగ సమన్వయకర్త కొఠారి హరిప్రసాద్ శర్మ బ్రహ్మత్వం వహించారు. అంబాజీపేట వేద ఘోషతో మార్మోగింది. కార్యక్రమంలో కోనసీమ జిల్లా సత్యసాయి సేవా సంస్థ అధ్యక్షులు అడబాల కొండబాబు, కాకినాడ జిల్లా అధ్యక్షులు వై.గోవిందరాజులు, జోనల్ కన్వీనర్ డాక్టర్ జి.ప్రభాకర్, ఆర్.నారాయణరావు, జిల్లా ఆధ్యాత్మిక విభాగ సమన్వయకర్త అడపా రాంబాబు, సేవ రాంబాబు, నెక్కంటి లక్ష్మి, సమన్వయ కర్తలు సీహెచ్ అరుణాదేవి, శిష్టా గుణరంజన్, సీహెచ్ దుర్గాభవాని తదితరులు పాల్గొన్నారు. అనంతరం భారీ అన్నసమారాధన చేశారు.



అంబాజీపేటలో రుద్రాభిషేకం నిర్వహిస్తున్న వేద పండితులు